క్లుప్తంగా

సర్పంచ్‌కు సన్మానం

పీలేరు రూరల్ : ఇటీవల పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన షేక్ జీనత్‌షఫీని వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాలమహానాడు ఐక్యవేదిక, బాస్ నాయకులు, చర్చి పాస్టర్లు మర్యాద పూర్వకంగా కలసి పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గుర్రం నారాయణ, ముల్లంగి చంద్రయ్య, రామాంజులు, బెల్లం రమేష్, విజయ్, రెడ్డెప్ప, వెంకట్, నాగులు, సుబ్రమణ్యం, ఏసీఎల్ఎం చర్చి పాస్టర్ జెర్మియా తదితరులు పాల్గొన్నారు.

అప్రంటీస్‌షిప్‌కు 15 మంది ఎంపిక

తంబళ్లపల్లె: స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నేషనల్ అప్రంటీస్‌షిప్ మేళా జరిగింది. సుమారు 30 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. బెంగళూరు కు చెందిన సరాగ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్‌కు 8 మంది, ఎల్‌ఎంటి లిమిటెడ్‌కు ఐదుగురు, మల్టిటెక్ ఇంజనీరింగ్ సెల్యూషన్‌కు ఇద్దరు ఎంపికైనట్లు పీఓ తెలిపారు. వీరికి అప్రంటీస్ షిప్ విధానంలో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

నిమ్మనపల్లె: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ బాలేవాండ్లపల్లె సమీపంలో స్థానికుడైన గోపాల్ సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నిందితుడిని అదుపులో తీసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

బి.కొత్తకోట: మండలంలోని గోళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌లో గత విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మానవత సంస్థ ప్రతినిధి రామచంద్రారెడ్డి సోమవారం నగదు బహుమతిని అందించారు. 582 మార్కులు సాధించిన యశశ్వినికి రూ.2,500, 530 మార్కులు సాధించిన ప్రదీప్ కుమార్ రెడ్డికి రూ.1,500, రవళికి రూ.1,500లను హెచ్ఎం కాంతారావు ద్వారా అందించారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధులు ఎన్.కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గట్టు వీఆర్ఓ మృతికి నివాళి


శివకుమార్ (ఫైల్)

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మదుమూరుకు చెందిన శివకుమార్ (57) బి.కొత్తకోట మండలం గట్టులో వీఆర్వోగా పని చేస్తూ సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయన గతంలో 10 ఏళ్ళ పాటు మండలంలోని పలు గ్రామాల్లో వీఆర్వోగా పని చేశాడు. ఈ నేపథ్యంలో పీటీఎం, ములకలచెరువు, బి.కొత్తకోట తహసీల్దార్లు విద్యాసాగర్, శ్రీనివాసులు, రఫీక్, విశ్రాంత తహసీల్దార్ వెంకట్రమణారెడ్డి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా సహాధ్యక్షులు, రాష్ట్ర ట్రెజరర్ జాన్సన్ ప్రదీప్‌కుమార్, ఉమ్మడి మదనపల్లి డివిజన్ అధ్యక్షులు కోలార్ క్రిష్ణప్ప, ఏపీఆర్‌జేఎస్ఏ జాయింట్ సెక్రటరీ అస్లాం, ఆర్ఐలు బాలాజీ, అనీషాతో పాటు మూడు మండలాల సర్వేయర్లు, వీఆర్వోలు శివకుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు నాగరత్నమ్మ, పద్మావతి, భాస్కర్‌నాయుడు, ఆనందరెడ్డితో పాటు పార్టీలకతీతంగా నాయకులు నివాళులు అర్పించారు.

కొత్తిమీర పంటపై విష ప్రయోగం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతికోట పంచాయతీ ముంతపోగులవారిపల్లికి చెందిన లక్ష్మీదేవమ్మ అనే మహిళా రైతు ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలో కొత్తిమీర పంట సాగు చేసింది. రూ.40 వేల దాకా పంట కోసం ధారపోయింది. పంట చేతికి వచ్చే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పంటకు గడ్డి మందు కొట్టడంతో ఎండిపోయిందని బాధిత మహిళ వాపోయింది. దీంతో రూ.2 లక్షల దాకా నష్టం జరిగిందని బాధిత మహిళ కంటతడి పెట్టింది.

శివాలయంలో సహస్ర లింగార్చన



పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సహస్ర లింగార్చన కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. శివాలయం సేవకులు పట్టాభిరామయ్య, ఆకుల మల్లికార్జునల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం,రుద్రహోమం, పూర్ణాహుతి,మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అలాగే అన్న ప్రసాదం అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

పేదలకు రక్ష.. ఆరోగ్య సురక్ష


మదనపల్లె : జగనన్న ఆరోగ్యసురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ భానుప్రసాద్, సర్పంచ్ ఫాతిమా,


ములకలచెరువు: మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

మదనపల్లె : పేదలకు ఆరోగ్య రక్షణ అందించడం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని ఎంపీడీఓ భానుప్రసాద్, సర్పంచ్ ఫాతిమా బీ అన్నారు. సోమవారం మండలంలోని కొండామర్రిపల్లె-1లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంకు హాజరైన ప్రజలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఐసీడీయస్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. గర్భిణులకు పౌష్టికాహార కిట్స్‌ను పంపిణీ చేశారు. దేశంలోనే ఎవరూ, ఎప్పుడూ ప్రజారోగ్యానికి సంబంధించి ఇలాంటి కార్యక్రమం చేయలేదని, ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేరీ, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, స్పెషల్ ఆఫీసర్ చందన, వైస్‌సర్పంచ్ రెడ్డెప్ప, తట్టివారిపల్లె సర్పంచ్ సిద్దలదీపా, వేమారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్‌ఇస్మాయిల్, నీరుగట్టిరమణ, పీఎస్.రవీంద్రనాయక్, డాక్టర్స్ ఫర్హానఖాన్, రూప్సీలక్ష్మి, నేత్రవైద్యనిపుణులు సుబాని, సులేమాన్, సీడీపీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం: పేదలకు అండగా జగనన్న సురక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీపీ కుసుమకుమారి , వైద్యాధికారిని లీలా తెలిపారు. సోమవారం ఊలపాడు పంచాయతీ మోడల్‌స్కూల్‌లో సర్పంచ్ రెడ్డెమ్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే తపనతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రతి వ్యాధికి చికిత్సలు చేసి , ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ స్వామి, తహశీల్దార్ దైవరాజన్, సచివాలయ కన్వీనర్ వీరేగౌడు, బీసీ సెల్ అధ్యక్షుడు తిమ్మయ్య, నాయకులు రమేష్, గెవన్న, రమణప్ప, వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యల పరిష్కారమే లక్ష్యం

తంబళ్లపల్లె: రాష్ట్రంలో ప్రతి ఇంటినీ జల్లెడపట్టి సర్వే ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యులు మహేష్ అన్నారు. సోమవారం రేణిమాకులపల్లె సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన స్పెషలిస్టు డాక్టర్ల చే వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. డాక్టర్లు అనుపమ, మునికుమార్‌లు పరీక్షలు నిర్వహించి వైద్య చికిత్స చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎంఈవో నాగసుబ్బారాయుడు, సర్పంచు మహ్మద్‌అలీ, వాటర్‌షెడ్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి, నాయకులురెడ్డెప్ప రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

ములకలచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరంగా మారిందని ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ సభ్యులు మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కదిరినాధునికోటలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేసినట్లు చెప్పారు. వైద్య పరీక్షలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మాధవరెడ్డి, సర్పంచు శంకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు

పెద్దతిప్పసముద్రం: ప్రతి గ్రామంలో ఇంటి ముంగిటకే ప్రభుత్వ వైద్యం చేరువ చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసారని సర్పంచ్ అనసూయమ్మ, సొసైటీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, గిరీస్వామి అన్నారు. సోమవారం మండలంలోని నవాబుకోటలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ప్రభుత్వ వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

పేదలందరికీ ఉచిత వైద్యం

గుర్రంకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేదలందరికీ ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ ఖాజాబీ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ పరిధిలోని 410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కంటి పరిక్షలు నిర్వహించి పలువురికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా పేదలందరికి నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేస్తారని ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశులు, ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, వైద్యాధికారులు రవీంద్ర, చైతన్య, సులోచన, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. మండలంలోని మర్రికుంటపల్లి గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధపడుతూ ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు. క్యాంప్‌లో మొత్తం 361 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చిన్నరెడ్డెప్ప, కావ్యగంధ, హిమబిందు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


గుర్రంకొండ: వృద్ధులుకు వైద్య పరీక్షలు


పెద్దతిప్పసముద్రం: వైద్యం చేయించుకుంటున్న సర్పంచ్


తంబళ్లపల్లె: మాట్లాడుతున్న ఎంపీటీసీ మహేష్

గుర్తింపు కార్డుల కోసం కళాకారుల దరఖాస్తు

కురబలకోట: భజన భక్తుల హృదయ నివేదనను భగవంతునికి నివేదిస్తుందని తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ మిట్టపల్లె రెడ్డెప్ప రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల భజన కళాకారులు గుర్తింపు కార్డుల కోసం తహసీల్దారుకు సోమవారం దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా అర్హులైన వారికి గుర్తింపు కార్డుల జారీకి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంచాలన్నారు. భజన అనే మూడు అక్షరాలు భగవంతునికి భక్తునికి అనుసంధానంగా నిలుస్తాయన్నారు. ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం సుబ్బారెడ్డి

మదనపల్లె సిటీ: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా వారి ఉన్నతికి అందించే ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ముబారక్ బాషా, పఠాన్ మహమ్మద్‌ఖాన్‌ల పౌరసన్మాన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల ఉపాధ్యాయులు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడుతూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న వారి సేవలు పలువురికి ఆదర్శనీయమన్నారు. వారికి పూలమాలలు, దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేగంగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

- వచ్చే ఏడాది జూలైలోపు పూర్తిచేయడమే లక్ష్యం
- 2024-25 విద్యాసంవత్సరంలో మెడికల్ కాలేజీలో ప్రవేశాలు
- ఏపీఎంఎస్ఎస్ఐడీసీ చీఫ్ ఇంజనీర్ సుధాకరరెడ్డి


ఆస్పత్రిపైన అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ సుధాకరరెడ్డి

మదనపల్లె : రాజంపేట పార్లమెంట్ పరిధిలో మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద మెడికల్ కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాది జూలైలోపు పూర్తిచేయడమే లక్ష్యంగా పనిచేయిస్తున్నామని ఏపీఎంఎస్ఎస్ ఐడీసీ చీఫ్ ఇంజనీర్ సుధాకరరెడ్డి తెలిపారు. సోమవారం ఆరోగ్యవరం మెడికల్ కళాశాల నిర్మాణపనులు, మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మెడికల్ కాలేజీ కోసం తాత్కాలికంగా నిర్మిస్తున్న అదనపు గదులను చీఫ్ ఇంజనీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో 330 పడకల గదుల నిర్మాణంతో పాటు, ఆరోగ్యవరం వద్ద మెడికల్ కాలేజీ జీప్లస్1 భవనం, బాయ్స్ హాస్టల్, జీప్లస్ 2, గరల్స్ హాస్టల్, జీప్లస్ 2 భవనాల నిర్మాణం పూర్తిచేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ప్లింట్‌బీమ్‌పై కాలమ్స్ నిర్మాణాలు జరుగుతున్నాయని, నెలరోజుల్లో గ్రౌండ్‌ఫ్లోర్ శ్లాబ్ పూర్తిచేస్తామన్నారు. వచ్చే ఏడాది జూలైలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు మెడికల్ కాలేజీ సౌకర్యాల పరిశీలనకు వస్తున్నారని, అంతలోపు నిర్దేశించిన లక్ష్యం పనులు పూర్తిచేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే అధ్యాపకులు నివసించేందుకు క్వార్టర్స్ పూర్తిచేస్తామన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో మెడికల్ కాలేజీలో ప్రవేశాలు జరపాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఎస్ఐడీసీ ఈఈ ధనంజయరెడ్డి, డీఈ కరీముల్లాఖాన్, మెగా ఇంజనీరింగ్ సీజీఎం రాజేంద్రరెడ్డి, పీఎం కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజకీయ వ్యూహకర్త కాన్షీరాం


కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ తదితరులు

మదనపల్లె : తరతరాలుగా బహుజనులను అణిచివేస్తున్న కులవివక్షను ఎదిరించి, బలహీనవర్గాలను బహుజనశక్తిగా పరివర్తన చేసేందుకు కృషి చేసిన మహనేత, బహుజన రాజకీయ వ్యూహకర్త కాన్షీరాం అని పలువురు కొనియాడారు. బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షీరాం వర్ధంతి సందర్భంగా సోమవారం బీఎస్పీ, వీసీకే పార్టీ కార్యాలయాలు, బహుజనసేన ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఎస్పీ మదనపల్లె ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అధ్యక్షతన సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ సిద్ధాంతంతోనే దేశంలో బలహీన, బహుజన వర్గాలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని, బహుజన సమాజ్‌పార్టీని ఏర్పాటు చేసి, నీలిజెండా ఏనుగు గుర్తుని ప్రకటించిన మహనీయుడు కాన్షీరామ్ అన్నారు. పీటీఎం.శివప్రసాద్ మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం సాధించేందుకు వీసీకే పోరాడుతుందన్నారు. కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా బహుజనసేన ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీచందు పేద ముస్లిం జంటకు వివాహం జరిపించారు.

ఘనంగా కాన్షీరామ్ వర్ధంతి

పీలేరు : కాన్షీరామ్ 17వ వర్ధంతిని భారతీయ అంబేడ్కర్‌సేన (బాస్) ఆధ్వర్యంలో పీలేరులో ఘనంగా నిర్వహించారు. సోమవారం కాన్షీరామ్ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాస్ జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మానవ హక్కులకు దూరంగా ఉంచబడిన పీడిత జనులకు విముక్తి కల్గించడానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తన జీవితం చివరి వరకు కృషి చేశారన్నారు. అనంతరం ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకున్న కాన్షీరామ్ మరణించేదాకా పోరాడిన గొప్ప పోరాట యోధుడని పేర్కొన్నారు. కాన్షీరామ్‌ను బహుజనులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, యర్రబెల్లి మల్లికార్జున, వెంకటరెడ్డి, హరినాథ, ముల్లంగి గురవయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటయ్య దాతృత్వం మరువలేనిది


రూ.లక్ష విరాళం అందజేస్తున్న వెంకటయ్య

కలకడ : రాయచోటికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆలయ అభివృద్ధిలో చూపిన చొరవ, వారి కుటుంబ సభ్యుల దాతృత్వం మరువ లేనిదని కోన శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ సభ్యులు కొనియాడారు. సోమవారం మండలంలోని కోన గ్రామంలో కొనసాగుతున్న చౌడేశ్వరిదేవి కల్యాణ మండపం నిర్మాణం పనులు చూసిన విశ్రాంత ఉపాధ్యాయులు ముద్దిశెట్టి వెంకటయ్య ఆయన కుమారులు శ్రీచౌశ్వరిదేవికి ప్రత్యేక పూజలు చేసి రూ.లక్ష వితరణ చేశారు. ప్రతి ఒక్కరిలో భక్తిని పెంచి ముక్తి మార్గన్ని చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చంద్రమోహన్ (చిట్టి), త్యాగరాజు, రామ్మోహన్, గురుస్వామి, బాలక్రిష్ణ, రెడ్డెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విప్లవ కెరటం చేగువేరా వర్ధంతి


వాల్మీకిపురం: విప్లవ కెరటం చేగువేరా వర్ధంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ వ్యక్తికి పట్టిన వైరస్‌కు చంపటం కన్నా సమాజానికి పట్టిన వైరస్‌ను చంపడం మిన్న అని భావించి, తన వైద్య వృత్తిని వదిలి విప్లవోద్యమంలో చేగువేరా చేరారన్నారు. 33 ఏళ్ల వయస్సులో క్యూబా పరిశ్రమల శాఖ మంత్రి అయ్యారని, ఆ తర్వాత విప్లవాన్ని విస్తరించేందుకు ఆయన మంత్రి పదవిని వదులుకొన్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయులు నాగరాజ, దుర్వాసులు నాయుడు, రమణప్ప, నాగేశ్వర, కల్పలత, తారాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి


బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం నటరాజ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు ఎ. జాఫర్‌సాదిక్, ఎన్. భారతి, జి. జాహ్నవి సౌజన్యంతో 6వ తరగతి నుంచి 9 తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యర్రయ్య, శిరీష, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ నూతన కమిటీ చైర్మన్ క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పూజారి పరమేశ్వరప్ప ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక పద్మశాలి కుటుంబీకులు ప్రతి ఏడాది స్వామివారికి పూజలతో పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రామూర్తి, శ్రీనివాసులు, నాగరాజు, మల్లికార్జున, బాలాజీ, మస్తానమ్మ, లలితమ్మ, భూదేవి పాల్గొన్నారు.

జాతీయ సీనియర్ సిటిజెన్స్ సభకు మునిగోపాలకృష్ణ

మదనపల్లె సిటీ: మహారాష్ట్రలోని పూణెలో ఈనెల 10, 11 తేదీల్లో జరగనున్న జాతీయ సీనియర్ సిటిజెన్స్ మహాసభకు ఈ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణ హాజరుకానున్నారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం అందింది. అలాగే జిల్లా మహిళా ప్రతినిధి ధనలక్ష్మి హాజరవుతున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ మురళి

మదనపల్లె : జగనన్నకు చెబుదాంలో సమస్యలపై ప్రజలు సమర్పించే అర్జీలను సకాలంలో పరిష్కరించడమే లక్ష్యమని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని గాంధీపురంలో చౌకదుకాణం ఏర్పాటుచేయాలని, గౌతమీనగర్‌లో బియ్యం పంపిణీ సక్రమంగా జరగడం లేదని, వేంపల్లె పంచాయతీ కన్నెమడుగువారిపల్లెకు రోడ్డు సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. ఓటీఎస్ పథకంలో నగదు చెల్లించినా హక్కు పత్రం పంపిణీ చేయలేదని మదనపల్లె మండలం ఆర్.సి.వడ్డిపల్లెకు చెందిన ఈశ్వరమ్మ ఫిర్యాదు చేసింది. ఎరుకులసంఘం ఎంప్లాయిస్ సొసైటీకి స్థలం కేటాయించాలని అర్జీ సమర్పించారు. మున్సిపాలిటీలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇంటిముందర నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ హ్యాండ్‌బోర్‌ను తొలగించాలని జనార్ధనరాజు, వితంతు పింఛన్ మంజూరు చేయాల్సిందిగా షేక్ ఫాతిమా, మెప్మా ఆర్పీ సుజాత మోసంతో రాష్ట్రప్రభుత్వం మంజూరుచేసిన అమ్మ ఒడి, వాహనమిత్ర పథకాల నగదు అందలేదని, ప్రశాంత్‌నగర్‌లో నీళ్లు సక్రమంగా రావడం లేదని ప్రజలు కమిషనర్ ప్రమీలకు అర్జీలు సమర్పించారు.

రోడ్డు భద్రతాపై అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ, ఎస్ఐ, అధ్యాపకులు

మదనపల్లె సిటీ: వేగం కన్నా ప్రాణం మిన్న అని వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవితం చాలా విలువైనదని, ప్రతి విద్యార్థి రహదారి నియమాలు పాటించి అప్రమత్తతో డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు నివారంచవచ్చునన్నారు. మితిమీరిన వేగం నిర్లక్ష్యం కారణంగా చాలా మంది రోడ్లపై తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు నిజజీవితంలో ఎలా క్రమశిక్షణతో ఉన్నత శిఖరాల అధిరోహించాలో వివరించారు. సైబర్‌క్రైమ్ ఇన్స్‌పెక్టర్ హుస్సేన్ సైబర్ నేరాలు వాటి ఎలా ఎదుర్కోవాలో,ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. కార్యక్రమంలో టు టౌన్ ఎస్ఐ హేమాద్రి, ప్రిన్సిపాల్ రమాదేవి, హెడ్ కానిస్టేబుల్ రామమూర్తి పాల్గొన్నారు. అనంతరం రహదారి నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు


నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

ములకలచెరువు: ఆస్తి కోసం కన్న తండ్రినే హతమార్చడానికి ప్రయత్నించి కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కొడుకును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ గాయత్రి కథనం మేరకు.. మండలంలోని పాతములకలచెరువు పంచాయతీ రామాపురంకు చెందిన వెంకటరమణ (63)ను కుమారుడు కరుణాకర్ ఆస్తి విషయంలో శనివారం రాత్రి కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. వెంకటరమణ రెండో భార్య శ్యామలమ్మ ఫిర్యాదుతో కరుణాకర్(31)పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం తంబళ్లపల్లె క్రాస్ వద్ద కరుణాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అప్రమత్తతతో రోడ్డు ప్రమాదాల నివారణ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

నిమ్మనపల్లె: అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద వాహనదారులకు , స్థానికులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు వేగంగా నడపడం వల్లే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల కారణంగా వికలాంగులుగా మారడం, మృత్యువాత పడటం జరుగుతుందన్నారు. వాహనాదారుల ట్రాఫిక్ నియమ,నిబంధనలు తప్పకుండా పాటించాలని, ద్విచక్రవాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ద్విచక్ర వాహనదారులు అధిక శబ్దాన్ని వాడకూడదన్నారు.